క్లుప్తంగా

రోడ్డుకు మరమ్మతు


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కాచిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిని గుంతలమయంగా మారి స్థానిక ప్రజలతో పాటు వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి గుంతలమయంగా మారిన రోడ్లను పరిశీలించి మరమ్మతు చేయించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్, ఏఈ ప్రశాంత్, ఆశాలత, బీజేపీ నేతలు ప్రభాకర్, మల్లికార్జున్, ఆర్.సంతోష్, ఎస్.రవియాదవ్, బి.భీమ్ రాజ్ పాల్గొన్నారు.

ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్ పెంచాలి


మంత్రులకు వినతిపత్రం ఇస్తున్న బక్కి వెంకటయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జనాభా ధామాషా ప్రకారం ఎస్సీలకు 18 రిజర్వేషన్ పెంచాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మకంగా సామాజిక కుల గణన సర్వే చేపట్టిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంచడానికి ఆర్డినెన్స్ తీసుకురావడం చరిత్రాత్మక నిర్ణయమని అన్నారు. పెరిగిన జనాభా ప్రకారం ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


కార్యక్రమంలో డీఐఓఎస్ ఆర్.సుమన్, హెచ్ఎం శాంత, విద్యార్థులు

చిక్కడపల్లి: విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని హిమాయత్‌నగర్ మండల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్ ఆర్.సుమన్ అన్నారు. శనివారం అశోక్ నగర్‌లోని గీతాంజలి ఉన్నత పాఠశాలలో విద్యార్థి నాయక బృంద ప్రమాణ స్వీకారంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శాంత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ కవి తగుళ్ల గోపాల్ రచించిన ధాన్యపు రాశి పుస్తకాన్ని డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, ప్రముఖ రచయిత నాగిల్ల రమేష్ రచించిన ఎంపల్లి పుస్తకాన్ని ప్రొఫెసర్ కాశిం శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్త తరం రాస్తున్న కవిత్వానికి ఒక పరామర్శ తగుళ్ల గోపాల్ ధాన్యపు రాశి అని అన్నారు. యువ తరం ఎలాంటి కవిత్వం రాస్తుందో తెలియాలంటే ఈ రెండు పుస్తకాలు ఒక ఉదాహరణగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రాము, బొబ్బరామ్, కవి యాకుబ్, మల్లెగోడ గంగప్రసాద్, డాక్టర్ విరించి విరివింటి, శిలలోలిత, దిలీప్, అనంతోజు మోహన కృష్ణ పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్: వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ హబీబ్ మియా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరబోయిన లక్ష్మయ్య, గౌరవ అధ్యక్షులు ముక్కు నర్సయ్యలు తెలిపారు.

కంపు కొడుతున్నా కనికరించరా?



గాంధీనగర్ డివిజన్‌లోని చిక్కడపల్లి పాత పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న జవహర్‌నగర్ బీఎస్ఎన్ఎల్ రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం ఇక్కడ ఉన్న డస్ట్‌బిన్ల వద్ద భారీగా వ్యర్థాలు పేరుకుపోతుండటంతో దుర్వాసన వస్తోందని ఆయా ప్రాంతాల వారు వాపోతున్నారు. బహిరంగంగా మూత్ర విసర్జన చేయడంతో మరింత ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు మెయిన్‌రోడ్డు వద్ద మంచినీటి వాల్ లీకై నీరు వచ్చి ఇక్కడ నిలుస్తుండటంతో బురదమయంగా మారుతోంది. దీనికి తోడు వివిధ వాహనాలను ఇక్కడే పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– చిక్కడపల్లి

తొలగించిన చెట్ల కొమ్మలు తరలించరా?



విద్యుత్ తీగలకు తగులుతున్నాయని చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది వాటిని తరలించకుండా రోడ్డుపైనే వదిలేస్తున్నారు. న్యూనల్లకుంటలోని న్యూ రామాలయం వద్ద ఉన్న ఓ మూడు భారీ వృక్షాల కొమ్మలు ఏపుగా పెరిగి విద్యుత్ తీగలకు తగులుతుండటంతో విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడుతోంది. కొమ్మలను తొలగించాలని జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. పది రోజుల క్రితం ఆలయ అధికారులు జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ అధికారుల అనుమతితో, సొంత ఖర్చులతో చెట్ల కొమ్మలను తొలగింపజేశారు. ఆ తర్వాత నరికి వేసిన చెట్ల కొమ్మలను అక్కడి నుంచి తొలగించాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది(రాంకీ సిబ్బంది) రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. చెట్ల కొమ్మల కారణంగా దోమలు వ్యాపించి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వెంటనే వాటిని తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– నల్లకుంట

కల్తీ కల్లు నివారణకు చర్యలు


కల్లు శాంపిల్స్‌ను సేకరిస్తున్న ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు

ముషీరాబాద్: కల్తీ కల్లు నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని ముషీరాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. శనివారం ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 10 కల్లు కాంపౌండ్‌లలో ఆకస్మిక తనిఖీలు చేసి శాంపిళ్లను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్లు కాంపౌండ్‌ల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను నారాయణగూడలోని ఎక్సైజ్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించామన్నారు. కాంపౌండ్ నిర్వాహకులు సహజసిద్ధమైన ప్రకృతి నుంచి వచ్చే చెట్ల కల్లునే విక్రయించాలని సూచించారు. శాంపిల్లలో అనుమానాలు ఉంటే కాంపౌండ్‌ను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గో రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి

కాచిగూడ: గోవుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలని శివ సేన పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గాటే గణేష్ కోరారు. ఈ మేరకు శనివారం శివసేన పార్టీ నేతృత్వంలో ప్రతినిధులు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. దేవాలయాలు, విద్యా సంస్థల పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అంబర్‌పేట, ముషీరాబాద్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, నాంపల్లి, జూబ్లీహిల్స్‌లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ గౌడ్, హరీష్ పాల్గొన్నారు.


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన గాటే గణేష్

పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ


మాట్లాడుతున్న వెంకట్‌రావు

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు 2024–25 విద్యా సంవత్సరానికి రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఫలితాల్లో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు అందించే ప్రతిభా పురస్కారాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. శనివారం కాచిగూడలోని ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో ట్రస్ట్ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఈనెల 31వ తేదీ లోగా కాచిగూడలోని ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 040–24658160, 9491627404 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆలోచనలే విజయానికి సోపానాలు


బ్యాగులు, స్కాలర్‌షిప్ చెక్కులు పంపిణీ చేస్తున్న శివకుమార్

కాచిగూడ: ఆత్మవిశ్వాసంతో కూడిన మంచి ఆలోచనలే విజయానికి సోపానాలుగా నిలుస్తాయని ఇంటలిజెన్స్ ఓఎస్‌డీ (ఐజీపీ) శివకుమార్ ఐపీఎస్ అన్నారు. వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు, వైశ్య హాస్టల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కాచిగూడ లోని హాస్టల్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్‌బుక్స్, స్కాలర్‌షిప్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొత్తూరు జయప్రకాష్ రామ్, ప్రధాన కార్యదర్శి కొండ్లే మల్లికార్జున్, హాస్టల్ అధ్యక్షుడు ఉప్పాల రాజేశ్వర్, పబ్బతి రవి ప్రసన్న కుమార్, పొద్దటూరి రాజేశ్వర్ రావు, కూర జయరాములు గుప్తా పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే


కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనలో విడుదలలో జాప్యం చేస్తుండటంతో ఆర్థిక పరిస్థితులు అనుకూలించక నిరుద్యోగులు చనిపోతున్నారని నిరుద్యోగ విద్యార్థి జేఏసీ నాయకులు శంకర్‌నాయక్, వెంకటేష్ ఆరోపించారు. తీవ్ర మనోవేదనకు గురైన చనిపోయిన నల్గొండకు చెందిన నిరుద్యోగులు అఖిల్, సిరిసిల్లకు చెందిన శ్రీకాంత్ చిత్రపటాల వద్ద శనివారం కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుద్యోగ ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే అన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ. కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరేష్, కిరణ్, లక్ష్మీకాంత్, గణేష్, సంపత్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కేబినెట్ నిర్ణయం హర్షణీయం


మాట్లాడుతున్న ప్రసాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం ఆర్డినెన్స్ ద్వారా చట్టం సవరణ చేయాలన్న రాష్ట్ర కేబినెట్ నిర్ణయం హర్షణీయమని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షులు కాటమోని వెంకటేష్ గౌడ్ తెలిపారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని డీఎస్‌డీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, వాకిటి శ్రీహరికి కృతజ్ఞతలు అన్నారు.

పచ్చదనానికి ప్రాధాన్యం


మొక్కలు నాటుతున్న కార్పొరేటర్

అంబర్‌పేట: డివిజన్‌లో పచ్చదనం పెంపొందించేందుకు చొరవ తీసుకుంటున్నట్లు బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా శనివారం డివిజన్‌లోని సీతా కాలనీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటానన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బోనాలు


పోతరాజు వేషధారణలో విద్యార్థులు

కవాడిగూడ : బోనాల పండుగ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ చైర్మన్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం కవాడిగూడలోని ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్‌లో బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి చాయాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న చాయాదేవి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి చాయాదేవి అన్నారు. శనివారం రాంనగర్ డివిజన్ సూర్యనగర్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చాయాదేవి మాట్లాడుతూ.. ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, సురేందర్, శ్రీమాన్, కుమారస్వామి, మంజుల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనల వైపు దృష్టి సారించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రొఫెసర్ రామకృష్ణ అన్నారు. శనివారం డాక్టర్ అంబేడ్కర్ కళాశాల ఆధ్వర్యంలో 'ద స్కోప్ ఆఫ్ రిలయన్స్ ఆఫ్ రిసర్చ్ ఇన్ అకాడమిక్ డిసిప్లెన్స్' అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిమాణాత్మకమైన పరిశోధనలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ చెన్న బసవయ్య మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరుగుతుందో పరిశోధనలు కూడా అదే తరహా పెరగాలన్నారు. పరిశోధనలు దేశ ప్రగతికి దోహదం చేస్తాయన్నారు. అనంతరం ప్రొఫెసర్ రామకృష్ణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియ, యాదగిరి ప్రిన్సిపల్ డాక్టర్ మట్టా శేఖర్, డాక్టర్ డి.వెంకటరమణ, టి.అశోక్ గౌడ్ డాక్టర్ బి. శ్రీధర్ పాల్గొన్నారు


ప్రొఫెసర్ రామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

దుకాణాల కూల్చివేతపై విచారణ జరిపించాలి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వేంకటేశ్వరస్వామి టెంపుల్‌లోని గోడ కూల్చివేతపై తగిన చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్‌రావుకు పలువురు వినతిపత్రం ఇచ్చారు. టెంపుల్‌లోని షాప్ నెంబర్ 1–8–492 వెనుకభాగం నుంచి గోడను కూల్చివేశారని దీనికి సంబంధించి హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా ఎవరి అనుమతి లేకుండా చైర్మన్ తన అనుచరులు కూల్చి వేశారని దీనిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు అశ్విని, పి.నవనీత కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లోకేష్ యాదవ్, జైపాల్‌రెడ్డి, చంద్రమోహన్, సతీష్, వైదిక వరదరాజస్వామి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పోరాటం

ముషీరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని గంగపుత్ర సంఘం కమ్యూనిటీ హాల్‌లో బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. గత పదేళ్లల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుకు ఉద్యమించాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ ఇన్‌చార్జి దీనదయాల్‌రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, ఆర్.శ్రీనివాస్, చాంద్‌పాషా, బీసీ సెల్ డివిజన్ అధ్యక్షుడు ఉమాకాంత్, మైనార్టీ కమిటీ సీనియర్ నాయకుడు మున్వర్‌చాంద్, మైనార్టీ సెల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మగ్బూల్, జబ్బార్, పార్టీ నాయకులు గోవింద్ రాజ్, కల్యాణ్, అజీజ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట: ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సూచించారు. సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద 30 మందికి మంజూరైన రూ.12.46 లక్షల విలువ చేసే చెక్కులను శనివారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు అండగా ఉండేందుకు తన వంతు చొరవ తీసుకుంటానన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతంగా పేదలకు చేయుతనిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

విద్యలో అంతరాలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి

● మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యలో అంతరాలను తొలగించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ ఏ. నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో 'విద్యలో అంతరాలు సమసిపోయేది ఎట్లా' అనే అంశంపై రౌండ్ టేబుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా, వైద్యం ప్రభుత్వ బాధ్యతని వివరించారు. 1971లోనే రాష్ట్ర ప్రభుత్వం విద్యలో అంతరాలను సృష్టించిందన్నారు. 1990 తరువాత ప్రైవేట్ పాఠశాలలు వచ్చాక మరింత అంతరాలు పెరిగాయని తెలిపారు. కార్యక్రమంలో పౌర స్పందన వేదిక ప్రధాన కార్యదర్శి ఎం. రాదేశ్యామ్, వివిధ సంఘాల నాయకులు ఆర్. వెంకట్‌రెడ్డి, శంకర్, రిటైర్డ్ డీఈఓ నారాయణరెడ్డి, మహ్మద్ అలీ, మంగ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి